క్లుప్తంగా

విద్యార్థినుల హస్తకళ ప్రదర్శన



దంతాలపల్లి: విద్యార్థులు చదువుతోపాటు వృత్తి నైపుణ్యాలను పెంపొందించుకోవాలని హెచ్‌ఎం కె.కృష్ణయ్య అన్నారు. మండలంలోని దాట్ల ప్రాథమికోన్నత పాఠశాలలో విద్యార్థినులకు నేర్పిన కుట్లు, అల్లికలు శనివారం ప్రదర్శించారు. హస్తకళలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు.

బోనాల సందడి



కురవి: మండల కేంద్రంలోని భద్రకాళీ అమ్మవారికి భక్తులు బోనాలను శనివారం సమర్పించుకోవడంతో సందడిగా మారింది. స్వామి వారిని దర్శించుకున్న అనంతరం భక్తులు, హిజ్రాలు బోనాలను ఎత్తుకుని మేళతాళాల నడుమ భద్రకాళీ అమ్మవారి ఆలయానికి వస్తూ పలు విన్యాసాలు చేశారు.

ఎమ్మెల్యేకు వినతి



మహబూబాబాద్ రూరల్: నేషనల్ హెల్త్ మిషన్ ఉద్యోగులు తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఎమ్మెల్యే భూక్య మురళీనాయక్‌కు శనివారం వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షుడు కుమార్, ప్రధాన కార్యదర్శి ఎండి.రుకుముద్దిన్, నాయకులు, సాన, శౌషిల్య, కిశోర్, రాజ్ కుమార్ పాల్గొన్నారు.

డైరీ అందజేత

మహబూబాబాద్ రూరల్: కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం డైరీని సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి దుడ్డెల రామ్మూర్తి, గిరిజన సామాజిక చైతన్య వేదిక వ్యవస్థాపకులు గుగులోత్ కిషన్ నాయక్ శనివారం ఎమ్మెల్యే మురళీనాయక్‌కు అందజేశారు. కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్లు జగన్, విజయవెంకటయ్య, సునీతరవి, నాగలక్ష్మిశ్రీనివాస్, బుజ్జివెంకన్న, కోఆప్షన్ సభ్యుడు శ్రీనివాస్ పాల్గొన్నారు.

సైనిక్ స్కూల్ ప్రవేశ పరీక్ష

మహబూబాబాద్ అర్బన్: తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల సైనిక్ స్కూల్ ఆరో తరగతి, 2024–25 విద్యా సంవత్సరానికి ప్రవేశ పరీక్ష ఈనెల 10న ఉదయం 10గంటల నుంచి మధ్యహ్న 12:30 గంటల వరకు జరుగుతుందని గురుకులం జిల్లా కోర్డినేటర్, ప్రిన్సిపాల్ జి.జయలక్ష్మి శనివారం తెలిపారు. రుక్మాపూర్ కళాశాల ఇంటర్ ప్రథమ సంవత్సరానికి ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం 1గంట వరకు పరీక్ష ఉంటుందన్నారు.

వీరభద్రస్వామి కల్యాణం



గార్ల: మహాశివరాత్రి పర్వదినం పురస్కరించుకొని శనివారం రాత్రి గార్లలోని వీరభద్రస్వామి దేవాలయంలో వీరభద్రస్వామి, సమేత భద్రకాళి కల్యాణ మహోత్సవంను అంగరంగ వైభవంగా నిర్వహించారు. పీటలపై తరుణ్ స్వాతి దంపతులు కూర్చోగా అర్చకులు రామాచార్యులు, ప్రవీణ్‌కుమార్‌శర్మలు కల్యాణ తంతును నిర్వహించారు. కార్యక్రమంలో భక్తులు ఎంపీటీసీ శీలంశెట్టి రమేష్, మాజీ సర్పంచ్‌లు బన్సీలాల్, లక్ష్మణ్‌నాయక్, రాంబాబు పాల్గొన్నారు.

బీజేపీ సంబురాలు



మహబూబాబాద్ అర్బన్: జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యుడిగా బీజేపీ గిరిజన మోర్చా రాష్ట్ర మాజీ అధ్యక్షులు జాటోత్ హుస్సేన్‌నాయక్‌ను నియమిస్తూ కేంద్ర ప్రభుత్వం ఉత్తర్వులు ప్రకటించడంపై మానుకోట జిల్లా కేంద్రంలోని నెహ్రూసెంటర్‌లో బీజేపీ నాయకులు బాణాసంచా కాల్చి, మిఠాయిలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షులు వెంకటేశ్వర్లు, రామచందర్ రావు, శ్యామ్ సుందర్‌శర్మ, శశివర్ధన్‌రెడ్డి పాల్గొన్నారు.

మహిళా దినోత్సవ ర్యాలీ

గూడూరు: మండలంలోని అయోధ్యపురం గ్రామంలో శనివారం మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని స్వర్ణభారతి గ్రామైఖ్య సంఘం ఆధ్వర్యంలో ర్యాలీ, నెహ్రూ యువ కేంద్రం వరంగల్, మహబూబాబాద్ వారి ఆధ్వర్యంలో మహిళలకు నారీ శక్తి ఫిట్నెస్ రన్ నిర్వహించారు. కార్యక్రమంలో ఐకేపీ ఏపీఎం రవీందర్, సీసీ ఐలయ్య, సీఏ శారద పాల్గొన్నారు.

ఘనంగా శివపార్వతుల కల్యాణం



కురవి: టేకులతండాలో మంగళసూత్రం చూపిస్తున్న అర్చకులు



కేసముద్రం: కాట్రపల్లి ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న శంకర్‌నాయక్

బయ్యారం/మరిపెడ: మండలంలోని పలు గ్రామాల్లోని శివాలయాల్లో శనివారం తెల్లవారుజామున శివపార్వతుల కల్యాణం ఘనంగా నిర్వహించారు. భక్తులు అధికసంఖ్యలో తరలివచ్చారు.

డోర్నకల్: మున్నేరువాగు సమీపంలోని శివాలయంతో పాటు అమ్మపాలెం గ్రామంలోని ముక్తేశ్వరస్వామి ఆలయంలో శివపార్వతుల కల్యాణ వేడుకలు ఘనంగా జరిగాయి.

నర్సింహులపేట: మండల కేంద్రంలోని శివాలయంలో శివపార్వతుల కల్యాణం పూజారి దేవేందర్ శర్మ అధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు.

కురవి: మండలంలోని నల్లెల్ల శివారు గాజతండా జీపీ పరిధిలోని టేకులతండాలో శనివారం తెల్లవారుజామున అత్యంత భక్తిశ్రద్ధలతో భ్రమరాంబిక దేవి సమేత మల్లికార్జున స్వామి కల్యాణం జరిగింది. కల్యాణంలో ఎమ్మెల్యే రాంచంద్రునాయక్, మండల అధ్యక్షుడు వీరభద్రం పాల్గొన్నారు.



డోర్నకల్: అమ్మపాలెంలో..



నర్సింహులపేట: మంగళసూత్రం చూపిస్తున్న అర్చకుడు

కేసముద్రం: కేసముద్రం మండలం ధన్నసరిలో శ్రీమల్లికార్జునస్వామి ఆలయంలో, కాట్రపల్లిలోని శివాలయంలో, ఉప్పరపల్లి ఆలయంలో, ఇనుగుర్తి మండల కేంద్రంలోని శివాలయంలో స్వామివారి కల్యాణ వేడుకలు కనుల పండువగా నిర్వహించారు.

దాతల సాయంతో నిరుపేదకు వైద్యం

బయ్యారం: అనారోగ్యంతో బాధపడుతున్న మండలకేంద్రానికి చెందిన నిరుపేద మహిళకు దాతలు తమ వంతుగా రూ.50వేల ఆర్థికసాయం చేసి వైద్యం అందేలా మానవత్వంను చాటుకున్నారు. వివరాలు ఇలా ఉన్నాయి. మండల కేంద్రంలోని ఎస్సీ కాలనీకి చెందిన పోతురాజు మనీషా నరాల సంబంధిత వ్యాధితో కొన్నిరోజులుగా బాధపడుతుంది. నిరుపేద కుటుంబం కావడంతో భర్త నాగరాజు వద్ద ఉన్న డబ్బులు వైద్య పరీక్షలకే సరిపోయాయి. ఈక్రమంలో బయ్యారం మిత్ర బృందం సభ్యులు శనివారం హైదరాబాద్‌లోని నిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న మనీషాను పరామర్శించి, ఆమె భర్త నాగరాజుకు ఆర్థికసాయం అందజేశారు. కార్యక్రమంలో మిత్రబృందం సభ్యులు రాజేష్, జనార్దన్, థామస్, నరేష్, శివ, కాలనీ పెద్దలు వీరభద్రం, శ్రీనివాస్, రమేష్, రవి, లక్ష్మినారాయణ పాల్గొన్నారు.



ఆర్థికసాయం చేస్తున్న మిత్రులు

కారు బోల్తా..

తప్పిన ప్రమాదం

మహబూబాబాద్ రూరల్: ప్రమాదవశాత్తు ఇన్నోవా కారు టైరు పంక్చర్ అయి బోల్తాకొట్టిన సంఘటన మహబూబాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని బేతోలు గ్రామ శివారులోని భజన తండా వద్ద శనివారం చోటుచేసుకుంది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. వరంగల్ రూరల్ జిల్లా మచ్చాపూర్ గ్రామానికి చెందిన పలువురు భక్తులు శివరాత్రి సందర్భంగా కురవి శ్రీవీరభద్ర స్వామివారి దర్శనానికి వచ్చారు. తిరుగు ప్రయాణంలో వారు ఓ ఇన్నోవా కారులో ఇంటికి వెళ్తుండగా భజన తండా వద్దకు చేరుకోగానే టైరు పంక్చర్ అయ్యింది. వెంటనే వాహనం అదుపుతప్పి రోడ్డు పక్కకు దూసుకుపోయింది. వాహనంలో ఉన్న వారు స్వల్ప గాయాలతో బయటపడ్డారు. సమాచారం తెలుసుకున్న కురవి పోలీసు కానిస్టేబుల్ నరేష్ సంఘటన స్థలానికి చేరుకుని వివరాలు సేకరించగా.. బాధితులు ఎవరు ఫిర్యాదు చేయలేదని కురవి ఎస్సై బైరు గోపి తెలిపారు.

అభ్యర్థుల గెలుపునకు కృషి చేయాలి



మాట్లాడుతున్న నాయకులు

గూడూరు: పార్లమెంట్ ఎన్నికల్లో ప్రజలు కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను గెలిపించి బ్రహ్మరథం పడతారని కాంగ్రెస్ జిల్లా నాయకులు మాధవపెద్ది రమేష్‌చందర్‌రెడ్డి, ప్రదీప్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని కార్యాలయంలో శనివారం మండల అధ్యక్షుడు చిట్టి వెంకన్న అధ్యక్షతన జరిగిన కార్యకర్తల సమావేశంలో వారు మాట్లాడారు. మానుకోట నియోజకవర్గ అభివృద్ధికి ఎమ్మెల్యే మురళీనాయక్ ఎన్నో అభివృద్ధి పనులు చేపడుతున్నారన్నారు. జరుగుతున్న అభివృద్ధిని చూసి ప్రజలు రానున్న ఎన్నికల్లో మాట తప్పని కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను గెలిపిస్తారనే ఆశాభావం వ్యక్తం చేశారు. కార్యకర్తలు రానున్న ఎన్నికల్లో అభ్యర్థుల గెలుపుకోసం కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నాయకులు బీరం శ్రీపాల్‌రెడ్డి, బొల్లికొండ మధుగౌడ్, ఎడ్ల నరేష్‌రెడ్డి, వాంకుడోతు కొమ్మాలునాయక్, చంటి స్వామి, రాసమల్ల యాకయ్య పాల్గొన్నారు.

విజయవంతం చేయాలి

పెద్దవంగర: ఈనెల 12న కేంద్ర హోంమంత్రి అమిత్ షా హైదరాబాద్ పర్యటనను విజయవంతం చేయాలని బీజేపీ జనగామ జిల్లా ఉపాధ్యక్షుడు మహేందర్ కోరారు. శనివారం మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో మండల అధ్యక్షుడు సుధాకర్ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు రంగు రాములు గౌడ్, నాయకులు శ్యామ్, ఆనంద్, భాస్కర్, శంకర్, సందీప్, శ్యాం, రాజు, హరీశ్ పాల్గొన్నారు.

కార్యకర్తలకు అండగా ఉంటాం..

డోర్నకల్: ప్రతీ కార్యకర్తకు అండగా ఉంటామని మాజీ ఎమ్మెల్యే డీఎస్ రెడ్యానాయక్ తెలిపారు. మండలంలోని గొల్లచర్ల గ్రామంలో శనివారం జరిగిన పార్టీ సమావేశంలో రెడ్యానాయక్ మాట్లాడుతూ.. బీఆర్ఎస్ అధికారం కోల్పోయిందని కార్యకర్తలెవరూ అధైర్యపడవద్దని, నిత్యం అండగా ఉంటామని తెలిపారు. మాళోత్ కవిత గెలుపునకు ప్రతీ కార్యకర్త కృషి చేయాలని కోరారు. డోర్నకల్‌లో సోమవారం పార్టీ సన్నాహక సమావేశం ఏర్పాటు చేశామని హాజరుకావాలని కోరారు. సమావేశంలో మండల అధ్యక్షుడు నున్నా రమణ, ఎంపీపీ ధరంసోత్ బాలునాయక్, పీఏసీఎస్ అధ్యక్షుడు బిక్షంరెడ్డి, కౌన్సిలర్లు బోరగళ్ల శరత్, ఎంపీటీసీ సభ్యులు నున్నా మల్లికార్జున్, నాయకులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రెడ్యానాయక్

ఆర్థికసాయం

కేసముద్రం: మండలంలోని కల్వల గ్రామానికి చెందిన ఎదునూరి లక్ష్మయ్య అనే వ్యక్తి ఇటీవల మృతిచెందాడు. ఈమేరకు శనివారం మృతుడి మిత్రులు బాధిత కుటుంబాన్ని పరామర్శించి, రూ.5వేల ఆర్థికసాయం అందజేశారు. కార్యక్రమంలో రఘోత్తంరెడ్డి, ఏకాంతం, నాగయ్య, రజాక్ పాల్గొన్నారు.

'రాజీనామా చేయాలనే హక్కు లేదు'



మాట్లాడుతున్న రామచంద్రయ్య

తొర్రూరు: తనను పదవికి రాజీనామా చేయాలనే హక్కు జెడ్పీటీసీకి లేదని మున్సిపల్ చైర్మన్ మంగళపల్లి రామచంద్రయ్య అన్నారు. ఇటీవల కాంగ్రెస్‌లో చేరిన మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్, ఇతర నాయకులు శనివారం డివిజన్ కేంద్రంలోని కాంగ్రెస్ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. చైర్మన్ మాట్లాడుతూ.. ప్రజా ఆకాంక్షల మేరకే కాంగ్రెస్‌లో చేరానని, తనను విమర్శించే అర్హత బీఆర్ఎస్ నాయకులకు లేదన్నారు. బీఆర్ఎస్‌లో ఉండి పదవులు అడ్డుపెట్టుకుని అక్రమార్జన చేసిందెవరో ప్రజలకు తెలుసన్నారు. రాజకీయంగా బీఆర్ఎస్‌ను పట్టణంలో బొంద పెడతామని తెలిపారు. సమావేశంలో వైస్ చైర్మన్ జినుగ సురేందర్‌రెడ్డి, నాయకులు గంజి విజయ్‌పాల్‌రెడ్డి, ప్రసాద్‌రెడ్డి, దొంగరి శంకర్, బచ్చలి లక్ష్మణ్, ముద్దసాని సురేష్, మహేందర్ పాల్గొన్నారు.

వీరబ్రహ్మేంద్రస్వామి కల్యాణం

మహబూబాబాద్ రూరల్: కాలజ్ఞాన తత్వవేత్త శ్రీపోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి, గోవిందమాంబ దేవి అమ్మవారి కల్యాణోత్సవాన్ని శుక్రవారం రాత్రి నిర్వహించారు. పట్టణంలోని పోతులూరు వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయంలో ఈ వేడుక జరిగింది. ముఖ్యఅతిథులుగా ఎమ్మెల్సీ రవీందర్‌రావు, మున్సిపల్ చైర్మన్ రామ్మోహన్‌రెడ్డి, కౌన్సిలర్లు ఎడ్ల వేణు, మార్నేని వెంకన్న పాల్గొన్నారు.

తొర్రూరు: పట్టణంలోని వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయంలో గోవిందమాంబ సమేత వీరబ్రహ్మేంద్రస్వామి కల్యాణ మహోత్సవం వైభవంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు కల్లూరు నాగేంద్రాచారి, పూర్ణాచారి, చంద్రశేఖరాచారి, సదానందాచారి, వెంకటాచారి, శ్రీనివాసాచారి పాల్గొన్నారు.



మహబూబాబాద్ రూరల్: కల్యాణంలో పాల్గొన్న ఎమ్మెల్సీ, తదితరులు

నీటి సౌకర్యం కల్పించాలి

గార్ల: గార్ల సమీపంలోని పాకాల ఏటి వద్ద గల వైకుంఠధామం వద్ద నీటి సౌకర్యం లేకపోవడంతో మృతదేహాలకు దహన సంస్కారాలు చేసేందుకు వచ్చిన ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. 10 రోజుల క్రితం వైకుంఠధామం వద్ద ఏర్పాటు చేసిన బోరు మోటారు, సర్వీస్ వైరు, విద్యుత్ బోర్డులు, ఇనుప కిటికీలు, తలుపులను గుర్తుతెలియని వ్యక్తులు ఎత్తుకెళ్లారు. బోరుకు మోటారు ఏర్పాటు చేసి నీటిసౌకర్యం కల్పించాలని మండల ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. ఇట్టి విషయంపై పంచాయతీ కార్యదర్శి కుమారస్వామిని వివరణ కోరగా వైకుంఠధామం వద్ద నీటి సౌకర్యం కల్పిస్తామన్నారు.

సంక్షిప్త సమాచారం

తాగునీటి ఎద్దడి లేకుండా చూడాలి

నెల్లికుదురు: మండలంలోని వివిధ గ్రామాలల్లో తాగునీటి ఎద్దడి ఏర్పడకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని ఎంపీడీఓ బాలరాజు పంచాయతీ కార్యదర్శులను ఆదేశించారు. మండలంలోని తారాసింగ్ బావితండా, మీఠ్యతండాలల్లో శనివారం నీటి ఎద్దడిపై ఎంపీఓ పార్థసారథి, మిషన్ భగీరథ ఏఈతో కలిసి పరిశీలించారు. వివిధ గ్రామాలల్లో తాగునీటి ఎద్దడి ఏర్పడకుండా ముందస్తుగా చర్య తీసుకోవాలని కార్యదర్శులకు తెలిపారు.

పరీక్ష సామగ్రి పంపిణీ

మరిపెడ రూరల్: మండలంలోని చిల్లంచర్ల జెడ్పీహెచ్‌ఎస్ పాఠశాల పదో తరగతి విద్యార్థులకు తెలుగు సమితి ఆఫ్ నెబ్రాస్కా(యుఎస్ఏ) వారి సహకారంతో స్ఫూర్తి ఎడ్యుకేషన్ సొసైటీ ఆధ్వర్యంలో పరీక్ష సామగ్రిని శనివారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో సొసైటీ అధ్యక్షుడు రామసహాయం శ్రీధర్‌రెడ్డి, హెచ్‌ఎం మంద జయ, సొసైటీ ప్రధాన కార్యదర్శి కృష్ణ, ఉపాధ్యాయులు అశోక్, శ్రీనివాస్, సంతోష్, శ్రీకాంత్ పాల్గొన్నారు.

జయప్రదం చేయండి

గార్ల: రైతుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఈనెల 14న మహబూబాబాద్‌లో నిర్వహించే ప్రదర్శన, ధర్నాను జయప్రదం చేయాలని ఏఐకేఎంఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి జి.సక్రు పిలుపునిచ్చారు. శనివారం మండలంలోని చిన్నకిష్టాపురం, అంజనాపురం, ముల్కనూరులో జరిగిన రైతుల సదస్సులో ఆయన మాట్లాడారు. ఈ సదస్సులో ధర్మయ్య, కాంతి, రామచంద్రు, రాములు, సోమయ్య పాల్గొన్నారు.

నీటి పైపు కాల్చివేత

చిన్నగూడూరు: మండల కేంద్రం శివారు పగిడిపల్లి వెళ్లే రహదారి వెంబడి ఉన్న నీటి పైపును గుర్తుతెలియని వ్యక్తులు కాల్చివేశారు. దీంతో గ్రామానికి మంచినీటి సరఫరా నిలిచిపోయిందని స్థానికులు తెలిపారు. స్థానికులు తెలిపిన సమాచారంతో ఎంపీఓ యాకయ్య పైపులైన్‌ను పరిశీలించారు. పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.

పదో తరగతి విద్యార్థులకు వీడ్కోలు

డోర్నకల్: స్థానిక సెయింట్ ఆగ్నేస్ పాఠశాలలో శనివారం పదో తరగతి విద్యార్థులకు వీడ్కోలు సమావేశం నిర్వహించారు. తొమ్మిదో తరగతి విద్యార్థులు పదో తరగతి విద్యార్థులకు వీడ్కోలు పలుకుతూ పరీక్షల్లో మంచి మార్కులు సాధించి పాఠశాలకు గుర్తింపు తేవాలని ఆకాంక్షించారు.

బోగ్ బండారో

డోర్నకల్: స్థానిక మున్నేరువాగు సమీపంలోని శివాలయ ఆవరణంలోని సేవాలాల్ మందిరంలో శ్రీలాకావత్ వెంకటరమణమ్మ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో శనివారం బోగ్‌బండారో కార్యక్రమం నిర్వహించారు.

తూతూ మంత్రంగా పోటీలు

మహబూబాబాద్ అర్బన్: జిల్లా కేంద్రంలోని ఎన్టీఆర్ స్టేడియంలో నెహ్రూ యువ కేంద్రం ఆధ్వర్యంలో నారీ శక్తి ఫిట్‌నెస్ రన్ కార్యక్రమాన్ని తూతూ మంత్రంగా నిర్వహించి నిర్వాహకులు చేతులు దులుపుకున్నారు. వివరాల్లోకి వెళ్తే.. ఉదయం మహిళలకు, యువతులకు నిర్వహించాల్సిన ఫిట్‌నెస్ రన్ ముందస్తు సమాచారం అందించడకుండా ప్రభుత్వ డిగ్రీ కళాశాల, నలంద డిగ్రీ కళాశాల విద్యార్థినులతో కార్యక్రమాన్ని నిర్వహించి బహుమతులను అందించారు.

ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలి

మహబూబాబాద్ రూరల్: పట్టణానికి చెందిన వికాస తరంగిణి జిల్లా కోశాధికారి, ఆర్యవైశ్య మహాసభ జిల్లా రీజియన్ చైర్మన్ కొండ్లె వెంకటేశ్వర్లు, వీరకుమారి దంపతుల పెళ్లిరోజు సందర్భంగా వన ప్రేమికుడు, హరితమిత్ర అవార్డు గ్రహీత దైద వెంకన్న వారికి శుభాకాంక్షలు తెలుపుతూ శనివారం మొక్కలు బహూకరించాడు.

సామాన్యులకు నష్టం

తొర్రూరు: ప్రధాని మోదీ విధానాలతో సామాన్యులకు నష్టం వాటిల్లుతుందని సీపీఐ (ఎంఎల్) ప్రజాపంథా జిల్లా సహాయ కార్యదర్శి కొత్తపల్లి రవి అన్నారు. డివిజన్ కేంద్రంలోని బస్టాండ్ సెంటర్‌లో శనివారం పార్టీ రాష్ట్ర కార్యదర్శి రాయల సుభాష్‌చంద్రబోస్ వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో డివిజన్ కార్యదర్శి వీరన్న, నాయకులు వెంకటేశ్వర్లు, రాములు పాల్గొన్నారు.

రవన్న ఆశయాలు సాదిద్దాం

బయ్యారం: విప్లవ పార్టీలో పనిచేస్తూ మరణించిన రాయల రవన్న ఆశయాలను సాదిద్దామని సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ జిల్లా కార్యదర్శి చిన్న చంద్రన్న అన్నారు. బయ్యారంలోని పార్టీ కార్యాలయంలో శనివారం రవన్న వర్ధంతిని నిర్వహించారు. నాయకులు జగ్గన్న, సూర్యం, యాకయ్య, భాస్కర్‌రెడ్డి, ధనుంజయ, పూర్ణ పాల్గొన్నారు.

ఉపాధి కూలీలకు సౌకర్యాలు కల్పించాలి



మరిపెడ రూరల్: వేసవిని దృష్టిలో పట్టుకొని ఉపాధి పనుల వద్ద పని చేసే కూలీలకు సౌకర్యాలు కల్పించాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు బాణాల రాజన్న డిమాండ్ చేశారు. ఈ మేరకు మండలంలోని ఎలమంచిలితండా గ్రామ పంచాయతీ పరిధిలో జరుగుతున్న ఉపాధి కూలీల పని ప్రదేశాలను సంఘం ఆధ్వర్యంలో ఆయన శనివారం పరిశీలించారు. అనంతరం కూలీలతో సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని చేపట్టారు. రాజన్న మాట్లాడుతూ.. కూలీలకు పని ప్రదేశంలో నీడకోసం టెంట్, తాగునీటి వసతి, ఫస్ట్ ఎయిడ్ కిట్ అందుబాటులో ఉంచాలన్నారు. కార్యక్రమంలో బానోతు సూక్య, భూక్య మల్సూర్, సుగుణ, సోములు పాల్గొన్నారు.

కాలనీ సమస్యలు పరిష్కరిస్తాం..

కురవి: మండలంలోని బలపాల గ్రామంలోని ఎస్సీ కాలనీని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే డాక్టర్ జాటోత్ రాంచంద్రునాయక్ శనివారం సందర్శించారు. స్థానిక శివాలయంలో పూజలు చేశారు. కాలనీలోని సమస్యలను తెలుసుకున్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కమ్యూనిటీ హాల్ నిర్మాణం, సీసీ రోడ్లు, ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తామన్నారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు అంబటి వీరభద్రం, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు గొల్లపల్లి రజనీకాంత్, ఆలయ ధర్మకర్త బాలగాని శ్రీనివాస్, నాయకులు మోహన్‌రావు, బిక్కు నాయక్, వెంకటనారాయణ, నాగేశ్వర్‌రావు పాల్గొన్నారు.



కార్యకర్తలతో ఎమ్మెల్యే రాంచంద్రునాయక్

అన్నదానం

మండల కేంద్రంలోని పశువుల సంత ఆవరణలో శనివారం హైదరాబాద్‌కు చెందిన శ్రీ వీరభద్రస్వామి సేవా సమితి ఆధ్వర్యంలో నాలుగు వేల మందికి అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేయగా ఎమ్మెల్యే జాటోత్ రాంచంద్రునాయక్ చేతులమీదుగా అన్నదానప్రసాద వితరణ చేశారు.

సిబ్బందికి వేతనాలు చెల్లించాలి



ఎమ్మెల్యేకు వినతిపత్రం ఇస్తున్న సిబ్బంది

తొర్రూరు: ఎన్‌హెచ్‌ఎం సిబ్బందికి పెండింగ్‌లో ఉన్న వేతనాలు చెల్లించాలని ఎంఎల్‌హెచ్‌పీఎస్ అసోసియేషన్ జిల్లా ఉపాధ్యక్షుడు రాజ్‌కుమార్ కోరారు. ఈమేరకు శనివారం డివిజన్ కేంద్రంలో ఎమ్మెల్యే మామిడాల యశస్విని‌రెడ్డికి ఎన్‌హెచ్‌ఎం సిబ్బంది వినతిపత్రం అందజేశారు. రాజ్‌కుమార్ మాట్లాడుతూ.. వైద్యారోగ్య శాఖలో రెగ్యులర్ ఉద్యోగులతో సమానంగా విధులు నిర్వహిస్తున్న ఎన్‌హెచ్‌ఎం సిబ్బందికి మూడు నెలలుగా వేతనాలు లేకపోవడంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో ప్రతినిధులు దొంగరి వినీత్, సాయికుమార్, రేవతి, మమత, తదితరులు పాల్గొన్నారు.

మున్నేరువాగును వినియోగంలోకి తేవాలి

నెహ్రూసెంటర్: మానుకోట మున్సిపాలిటీలో మంచినీటి సమస్య పరిష్కారానికి మున్నేరువాగును అభివృద్ధి చేసి వినియోగంలోకి తీసుకురావాలని సీపీఐ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ బి.అజయ్‌సారథిరెడ్డి అన్నారు. మున్సిపాలిటీ పరిధిలోని మున్నేరువాగు, ఫిల్టర్ బెడ్‌ను సీపీఐ శ్రేణులు శనివారం సందర్శించారు. ఈసందర్భంగా అజయ్‌సారథిరెడ్డి మాట్లాడుతూ.. మున్సిపాలిటీలో 15 వార్డులకు పూర్తిస్థాయిలో మిషన్‌భగీరథ పైపులు వేయకుండానే పాత పైపుల ద్వారానే నీటిని సరఫరా చేస్తున్నారని అన్నారు. ఇప్పటికైనా శాశ్వత మంచినీటి సరఫరాకు చర్య తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో సీపీఐ పట్టణ కార్యదర్శి పెరుగు కుమార్, సహాయ కార్యదర్శి రేషలపల్లి నవీన్, నాయకులు నర్ర శ్రావణ్, వెలుగు శ్రావణ్, మల్లికార్జున్, భద్రయ్య, రవి, రమేష్, తదితరులు పాల్గొన్నారు.



మున్నేరువాగును సందర్శిస్తున్న అజయ్‌సారథిరెడ్డి

అంతర్జాతీయ మహిళా దినోత్సవం



డోర్నకల్: సెయింట్ ఆగ్నేస్ పాఠశాలలో మహిళా దినోత్సవ వేడుకలు



చిన్నగూడూరు: ఎంపీపీ పద్మను సన్మానిస్తున్న ఎంపీడీఓ

అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. వివిధ రంగాల్లో ఉద్యోగాలు చేస్తున్న మహిళలను సన్మానించారు. ఈసందర్భంగా పలువురు ప్రముఖులు మాట్లాడుతూ.. వివిధ రంగాలలో పురుషులతో సమానంగా మహిళలు రాణిస్తున్నారన్నారు.

– సాక్షి నెట్‌వర్క్



దంతాలపల్లి: ఉపాధ్యాయినులకు సన్మానం..